

# ధనమూలమిదం జగత్

మన జీవితాలలో నిత్యం పెనవేసుకుపోయిన వస్తువు ధనం. అంటే మన ఉద్దేశంలో కాగితాల కట్టలు! బంగారం, వెండి, రత్నాలు నేటికి కాగితం రూపుదిద్దుకున్నాయి. ఇది పూర్వపు భారతదేశంలోని ధనం యొక్క రూపం కాదు. ఆ మాటకి అర్థమే వేరు. సిరిసంపదలనిచ్చేది శ్రీ మహాలక్ష్మి. 'ధనమగ్నిర్ధనం, వాయుర్ధనం, సూర్యోధనం వసుః ధనమింద్రోర్వ రుణం ధనమశ్నుతే''. అంటే ఏమిటి? వీరంతా మహాలక్ష్మి దయతో ధనాన్ని అనుభవిస్తున్నారట. వారికి మనలాగ ఇల్లూ, సంతానం అనేవి ఉండవు కదా!

మరివారికి ధనం అంటే బంగారమా? రత్నాలా? అవేవీ కాదు. జీవకోటి అంతా వారిమీదే ఆధారపడి బతుకుతోంది. ఆ విధంగా అందరి జీవనానికి కారణమైన వీరు ధనవంతులు. అగ్ని, వరుణుడు, వాయువు, ఇంద్రుడు, సూర్యుడు, బృహస్పతి, వస్తువులు వీరంతా ధనవంతులని అర్థం. అంటే వారే ధనం అని అర్థం. మనం ఆ విధంగా ఎప్పుడూ ధనం కాలేము. ఆ ధనమనేది మనకి కావాలి కాబట్టి మనం నిర్ధనులం. అందువల్ల మనుష్యుడు ధనాన్ని కోరతాడు. అంతవరకూ అది సహజమే.

ఆ తరువాత అనేక ధర్మసందేహాలొస్తాయి. నాకెంత ధనం కావాలి? ఎంత ఉండకూడదు? దాన్ని ఎలా సంపాదించాలి? ఎలా సంపాదించకూడదు? దాన్ని ఎలా వ్యయం చేయాలి? ఎలా చేయకూడదు? ఈ ప్రశ్నలు మనసులోకి రాకుండా ఏ ఉపాయం చేతనైనా, ఎంతైనా సంపాదించాలి అనుకోవడం చేత మనుష్యుడి మార్గం వక్రం, అధర్మం, పాప పంకిలం అవుతోంది. నేడు మన ప్రపంచంలో అన్ని పాపాలకు, మోసాలకు, దొంగతనాలకు, హత్యలకు, మానవ హింస ఇలా అన్నింటికీ ఇదే కారణం. దారి దోపిడీగాళ్లూ, వ్యాపారం పేరుతో మోసం చేసేవారు ఉన్నారు. అసలు వ్యాపారమే మోసంతో ప్రారంభించి, మరో దేశంమీద దాడిచేసి దోచుకోవడమే కాక, అవకాశాన్ని బట్టి తన దేశ ప్రజల సొమ్మునే చౌర్యం చేయడం పాపానికి పరాకాష్ఠ.

ధనాన్ని దొంగిలించడం సమాజంలో అట్టడుగున ఉన్నవాళ్లు చేసిన పాపంగా మనకి కథలున్నాయి. ఆ చౌర్యం ఏమీ కొత్త విషయం కాదు. అయితే ధర్మమంటూ ఒకటుందని, అది మనని శిక్షించక మానదని విద్యావంతుల్లో, అధికారుల్లో, పరిపాలకుల్లో, సామాన్య ప్రజలలో స్థిరంగా పాతుకుపోయిన విశ్వాసం. దానివల్ల పాపభీతి. ఇది పాతకాలపు భారత సమాజం.

ధనం దొంగిలిస్తే ఏమవుతుంది? ధనం దొంగిలించినవాడికి, ఆ ధనం పోగొట్టుకున్న వాడికి మధ్యన ఎటువంటి సంబంధముంటుంది? ఇలాంటి ప్రశ్నలు తెలుసుకుంటే మనలో కొందరికైనా ఆలోచనా సరళి మారవచ్చునేమో! ఈ సందర్భంలో ఒక పురాణ కథ గుర్తు చేసుకుందాం.

పాపాలని గురించి బృహస్పతి ఒకప్పుడు ఇలా వివరించాడు-

1. బ్రహ్మవేత్తగాని, దరిద్రుడు, భార్యా పిల్లలు కలిగినవాడు, కష్టపడి ధనం సంపాదించుకున్న వాడు-అట్లాంటి వాడి ధనం అపహరిస్తే దోష పరిహారమే లేదు.

2. నమ్మిన వాడి ధనం అపహరిస్తే మరీ ఎక్కువ పాపం.

3. దైవ బ్రాహ్మణుల ధనం దొంగిలిస్తే వాడిని చంపడం తప్పుకాదు.

అటువంటి పాపాన్ని గురించి కథ ఒకటుంది.

ఒకప్పుడు కంచి పట్టణం ధనంతోనూ, ధర్మంతోనూ తులతూగింది. ఆ ఊళ్లో ఒక దొంగ ఉండేవాడు. వాడి పేరు వజ్రుడు. అవకాశం దొరికినప్పుడల్లా ప్రజల ఇళ్లలో ధనం దొంగిలించేవాడు. ఆ ధనాన్ని ఊరికి దూరంగా ఉండే అడవికి వెళ్లి ఒక చోట గొయ్యి తీసి అందులో దాచేవాడు. ఆ విధంగా చాలా ధనం ప్రతీసారీ అక్కడ పాతిపెట్టి పైన రాళ్లు కప్పి మట్టిపోసేవాడు. ఈ విధంగా ఆ దొంగ అడవికి వెడుతుండడడం ఒక కిరాతుడు చూశాడు. వాడు కట్టెలు అమ్ముకునేవాడు. నెమ్మదిగా దొంగకి తెలియకుండా,ఆ పాతిన ధనంలో పదోవంతు దొంగిలించాడు. అది చాలానే ఉంది. తీసుకువెళ్లి భార్యకిచ్చాడు. ఆవిడ కొద్ది రోజులలో భర్తతో ఒక మాట అంది. మన ఇళ్ల మధ్య ఒక బ్రాహ్మణుడున్నాడు. నన్ను చూసి పక్కావిడతో ''ఈ స్త్రీ కొద్ది రోజులలో చాలా ధనవంతురాలవుతుంది. కాని భిల్లులు, నటులు, కిరాతులు, వీళ్లకి లభించిన ధనం ఎక్కువ కాలం ఉండదని వాల్మీకి శాపం ఒకటుంది. అయినప్పటికీ ఆ స్త్రీ మాత్రం భాగ్యవంతురాలు, పుణ్యాత్మురాలు అవుతుంది సుమా'' అన్నాడు. ''అలాంటి బ్రాహ్మణుడు చెప్పిన మాట అబద్ధం కాదుకదా! అందుకే నీకీ ధనం దొరికింది.''

''అయితే మనమిప్పుడేం చెయ్యాలి?'' అని అడిగాడు భర్త.

''కష్టపడి సంపాదించిన ధనం నిలుస్తుంది. ఇతర ధనం నశించేదే. స్వయంగా లభించిన ధనం మాత్రం ధర్మానికే ఖర్చుపెట్టాలి. కనుక మనం ఈ ధనాన్ని ప్రజలకి పనికొచ్చే బావులు, చెరువులు తవ్వించడానికి ఖర్చుపెడదాం'' అంది భార్య.

భార్య మాట కిరాతకుడికి నచ్చింది. చివరికి ఒక మంచి చోటు ఎన్నుకుని శుభ్రమైన నీరుగల ఒక చెరువును నిర్మించాడు. ధనమంతా దానికే ఖర్చయింది. ఇంకా చెరువు పని కొంత మిగిలిపోయింది. అప్పుడా కిరాతకుడు ఆలోచించి పూర్వం తాను ఆ ధనం ఎక్కడ దొంగిలించాడో అక్కడికి వెళ్లి ఆ దొంగ దాచుకున్న ధనం మళ్లీ చాలా దొంగిలించి తెచ్చాడు. ఆ ధనం అంతా ఖర్చుపెట్టి చెరువు మధ్యలో ఓ వంతెన కట్టి ఒక శివాలయం కూడా కట్టాడు. అదొక పెద్ద క్షేత్రమైంది. దాన్ని ఆ కిరాతకుడు ప్రసిద్ధులైన బ్రాహ్మణులకి దానం చేశాడు. అందులో దేవరాతుడనే బ్రాహ్మణుడు కూడా ఉన్నాడు. ఆ బ్రాహ్మణులు సంతోషించి ఆ కిరాతుడికి 'ద్విజవర్మ' అనే పేరు, అతడి భార్యకు 'శీలవతి' అని పేర్లుపెట్టి ఆశీర్వదించారు. ఆ దంపతులక్కడే ఉండి ఆ ఆలయానికి, ఆ బ్రాహ్మణులకు సేవ చేస్తూ ఉండిపోయారు.

కొంతకాలం గడిచింది. ద్విజవర్మ కాలం చేశాడు. ఆ జీవుడిని దొంగగా భావించి తమ లోకానికి తీసుకువెళ్లడానికి యమదూతలు వచ్చారు.అతడి పుణ్య కార్యానికి ఫలితంగా వైకుంఠం నుంచి విష్ణు దూతలు వచ్చారు. వాళ్లకి చిక్కు విడలేదు. నారద మహర్షి ప్రత్యక్షమయ్యాడు. నారదుడు వారితో అన్నాడు. 'ఈ జీవుడిప్పుడు ఏ లోకానికి వెళ్లనక్కలేదు. ఇక్కడే పూర్వ స్మృతిలో వాయురూపంలో (అంటే పిశాచంగా) తిరుగుతున్నాడు. ఎంతోమంది ద్రవ్యం అపహరించాడు కాబట్టి ఆ ధనం పోగొట్టుకున్న వారంతా మరణించే వరకూ ఇతడు ఆ వాయురూపంలోనే ఉంటాడు. అతడు భూలోకాన్ని వదలడు. కాని పాపక్షయం చేసుకుంటాడు.''

ఆ విధంగా ఆ కిరాతుడు ఆ ధనాన్ని పోగొట్టుకున్న వారందరూ మరణించేవరకూ 12 సంవత్సరములు వాయురూపంలో ఉంటాడు. నారదముని కిరాతుని భార్య శీలవతితో ''అమ్మా! నీకు ఏ పాప దోషం అంటలేదు నీవు ఇప్పుడే బ్రహ్మలోకానికి వెళ్లవచ్చు'' అన్నాడు.

అప్పుడు శీలవతి నారదుడితో ''స్వామీ! నా భర్తని ఈ స్థితిలో వదిలి బ్రహ్మలోకానికి ఎలా వెళ్లగలను? ఆయన గతే నా గతి. నా భర్త ఏ లోకానికీ వెళ్లలేదు. ఆయన తన శరీరం మళ్లీ పొందాలి. నాకు ఉపాయం సెలవీయండి'' అని అడిగింది.

బ్రహ్మలోకానికి అర్హతపొందిన ఆ స్త్రీ కోరిక నెరవేరడం సమంజసమని నారదుడు అనుగ్రహించాడు.

''నీ భర్త శరీరం కర్మానుభవం అయిపోగానే అతని శరీరం నా ఆశీస్సుతో తిరిగి పొందవచ్చు. దానికై నీవు ఒక మహా తీర్థానికి వెళ్లి ఉమామహేశ్వరులను పూజించి ధ్యానిస్తూ ఆహార నియమంతో శతరుద్రీయం జపించు. వెయ్యిపైన ఎనిమిది సార్లు ఈ శతరుద్రీయం జపిస్తే, బ్రహ్మహత్య పాపం కూడా తొలగిపోతుంది. నీ భర్త నా వరంచేత, నీ ఉపాసన చేత ఈ లోకంలోనే తన శరీరం తిరిగి పొందుతాడు'' అని చెప్పాడు నారదుడు.

ఈ విధంగా ఆమె తపస్సు చేసింది. ఆమె భర్త 12 సంవత్సరాల తరువాత తన దేహం తిరిగి పొందాడు. దంపతులు శివభక్తితో కొంతకాలం జీవించి ఇద్దరూ మరణించారు. అతడు దొంగిలించిన సొమ్ము తాలూకా యజమానులు అందరూ కూడా మరణించారు. ఈ ద్విజవర్మ, శీలవతి దంపతులు కైలాసానికి వెళ్లి రుద్రగణములలో చేరిపోయారు.

ఇంద్రుడికి ధర్మసందేహం వస్తే, బృహస్పతి ఇలా చెప్పాడు.

1. మొదటి దొంగ వజ్రుడు దొంగిలించిన ధనం, కిరాతుడి ద్వారా సద్వినియోగం అయింది. అందువల్ల ఆ పుణ్యంలో సగం అతడికి దక్కింది. ఆ సగం పుణ్యంవల్ల ఆ వజ్రుడు కొంతకాలం స్వర్గంలో సుఖించి తరువాత నరకానికి వెళ్లాడు.

2.దొంగిలించిన ధనం యొక్క యజమానులు తమ ధనం ఎంతవరకూ సద్వినియోగం అయ్యిందో అంత పుణ్యంవల్ల స్వర్గానికి వెళ్లారు.

3. కానీ అంతకుముందు వాళ్లే (ఆ యజమానులు) భూమ్మీద మరణించే వరకూ వారి సొమ్ము దొంగిలించినవారు వాయురూపంలో భూలోక పరిధిలోనే శిక్ష అనుభవిస్తారు.

4. ఒక దొంగ వేయిమంది ధనాన్ని అపహరిస్తే వారందరూ మరణించేదాకా ఇక్కడే వాయురూపంలో దుఃఖపడాలంటే ఎంతకాలం పడుతుందో?

5. ఒక వేళ ఆ చోరుడే ముందు మరణిస్తేనో? అప్పుడు సందేహమే లేదు. నేరుగా ఆ నరకానికి వెడతాడు. ఎందుకంటే భూలోకంలో శిక్ష అనుభవించలేదు కాబట్టి.

6. ఒకవేళ పోగొట్టుకున్న ధనంలో కూడా యజమానికి కొంత పాపముంటే ఆ పాపం కూడా ఆ దొంగతోనే పోతుంది.

7. ఒకడు పోగొట్టుకున్న సొమ్ము వాడు అక్రమమార్గంలో సంపాదించిన ధనంలో చాలా కొంచెమే కావచ్చు., అదేకాక ఇంకా చాలా ధనం ఇంట దాచి చనిపోతే అదంతా ప్రజలకి చేరేదాకా వాడు మరణించినా పిశాచంగానే ఉంటాడని అర్థం.

8. సొమ్ము పోగొట్టుకున్న వాడు మరణించేదాకా ఆ దొంగ చనిపోయి పిశాచమయితే ఆ యజమాని మరణంతో దొంగకు ఎందుకు విముక్తి వస్తోంది?

యజమాని చనిపోగానే అతడికి ధనంతో ఉన్న సంబంధం, మమకారం నశించిపోతుంది. ఆ తరవాత వానికి దుఃఖమే లేదు. అదే దొంగకు ముక్తి.

పెద్దలంటారు:- 'గహనా కర్మణో గతిః' కర్మ యొక్క ఫలం ఎన్ని మలుపులు తిరిగి ఎటు ప్రవహిస్తుందో ఎవరూ చెప్పలేరు అని అర్థం. కిరాతుడి భార్య శీలవతి అతడి దొంగతనాన్ని పుణ్యకార్యంగా మార్చి, తన భర్తను రక్షించుకొని, ఆ తరువాత అతడితో సహా శాశ్వత పుణ్యలోకానికి వెళ్లింది. ఎట్టి పాపం చేసేవారికైనా అతడికి శీలవతి వంటి భార్య (అంటే అంత మంచి మంత్రి) దొరికితే తప్పక రక్షించబడతారు. భర్త పాపాన్ని ఆమోదించే భార్య ఆ పాపాన్నే పంచుకుంటున్నది.

ఇంతకీ ఇంతింత పాపాలు చేయించే దుష్ట శక్తి ఏది? ధనమే! అది దరిద్రుడిని చేరితే తానే పుణ్యకారణం అవుతుంది. ఈ ప్రపంచంలో ధనంయొక్క దారులు ఈశ్వరుడు సరిగా మళ్లించగలిగితే ఈ లోకంలో పాపమే ఉండదు కదా!

అక్రమ ధనం అడవిలో పాతిపెట్టినా, మరోచోట దూరంగా దాచిపెట్టినా ఈ సూత్రాలు దానికి కూడా వర్తిస్తాయి అనేది ధర్మనిర్ణయం. నమ్మండి. నమ్మక పోండి.

**- సద్గురు శివానందమూర్తి**

Powered by pressmart Media Ltd